క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ జి.సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొత్తపేట, మెయిన్ బజార్, వడ్ల పూడి సెంటర్, గౌతమబుద్ధారోడ్ తూర్పు, ఎల్‌బీ నగర్, ఇస్లాంపేట, పాత మంగళగిరి, గండాలయపేట, భార్గవపేట, బాప్టిస్ట్‌పేటలతో పాటు నూతక్కి, రామచంద్రాపురం, చిన కాకాని, కాజ, వెంకటరెడ్డి పాలెంతోపాటు తాడేపల్లి మండలం చిర్రావూరులలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఎస్‌ఆర్‌ఎంలో ఇంటర్ స్కూల్ క్రీడాపోటీలు

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో కల ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మూడు రోజులు పాటు జరిగిన ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఇంటర్ స్పోర్ట్స్‌లో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ జట్టు విజేతగా నిలవగా ఆడిటోరియంలో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్‌ను నిర్వాహకులు అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డీన్లు డాక్టర్లు సీవీ టామి, విష్ణుపథ్, అనూప్‌సింగ్, సూర్యవంశి, పంకజ్ బల్వేరియాలు పాల్గొన్నారు.

మేడికొండూరులో ప్రజాదర్బార్

మేడికొండూరు: మేడికొండూరు మండల పరిధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన సమస్యలుగా పింఛన్లు ఆగిపోయాయని మళ్లీ ఇప్పించాలని, వ్యవసాయ భూమి సమస్యలు, సీసీ రోడ్లు వేయాలని అర్జీదారులు ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మలిపెద్ది రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, నార్నే శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు, పాములపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో సీపీఎం గ్రామ సభ

తాడేపల్లిరూరల్: సీపీఎం దుగ్గిరాల కార్యాలయంలో బుధవారం సిహెచ్ పోతురాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ఈమని అప్పారావు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీని మెరుగు పరచాలని, దుగ్గిరాల గ్రామానికి కరెంటు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, దుగ్గిరాల పాత లాకుల నుంచి రేవేంద్రపాడు వంతెన వరకు వున్న రోడ్డును పునః నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్నివెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యదర్శిగా ఎన్.యోగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, సీహెచ్ పోతురాజు, జి.శ్రీనివాసరావు, బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖ సేవలు అభినందనీయం

తాడికొండ: అనాదిగా ప్రజలకు పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తాడికొండ గిల్డ్ సభ్యులు కొనియాడారు. అంతర్జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన సత్కార సభకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కొరియర్, టెలిఫోన్, ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో లేని సమయంలోనే గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ సేవలు అందించడంలో పోస్టల్‌శాఖ మేటిగా నిలిచిందని కొనియాడారు. అంతర్జాతీయంగా పోస్టల్ శాఖ అందించిన సేవలకు గాను అక్టోబర్ 9న నిర్వహించే వేడుకలను తాడికొండ వేదికగా తాము గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తాడికొండ సబ్ పోస్టుమాస్టర్ ముప్పా నాగ కుమార్, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. గిల్డ్ ప్రెసిడెంట్ కె.గోపాలరావు, సెక్రటరీ జె.సుబ్బారెడ్డి, సభ్యులు దమ్మాటి రమేష్, చింతల భాస్కరరావు, కె.రామారావు పోస్టల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ఫిరంగిపురం: గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించాలని లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. లెప్రసీకి సంబంధించి ఎన్ని కేసులున్నాయని వైద్యురాలు యానీగ్రేస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఐదు కేసులు గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఆయన మాట్లాడుతూ లెప్రసీలో పాసి, మల్టి వంటి రెండు రకాలు ఉన్నాయన్నారు. పాసి ఉన్న వ్యక్తికి మందులు ఇస్తూ ప్రతి ఆరునెలలకు ఒకసారి వివరాలు రెండేళ్లపాటు సిబ్బంది పరిశీలించాలన్నారు. మల్టి ఉన్నవారికి మందులు ఇస్తూ 12నెలలకు వివరాలు సేకరిస్తూ ఐదేళ్లపాటు పరిశీలించాలని చెప్పారు. వాటితోపాటు వారికిచ్చిన కార్డులో వివరాలు నమోదుచేయాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ ప్రియదర్శిని, డీటీఓ లక్ష్మానాయక్ ఉన్నారు.

‘చేనేత భవన్’ కేటాయింపులు ఎన్నడో?

- దుకాణాలు కేటాయించాలని కోరుతున్న వస్త్ర వ్యాపారులు
- తెనాలి రోడ్డులోని వ్యాపారులకు దుకాణాలు కేటాయిస్తే రోడ్డు విస్తరణ త్వరగా జరిగే అవకాశం
- తెనాలి రోడ్డు విస్తరణను సత్వరం ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు


పాత బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవన్


తెనాలి రోడ్డు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేనేత వ్యాపారులకు మంచి దుకాణసముదాయం నిర్మించి వారి వ్యాపారాలను పెంచేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా పాతబస్టాండ్ ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ ప్రగడ కోటయ్య చేనేత భవన్‌ని నిర్మించారు. తెనాలి రోడ్డులో పాతబస్టాండ్ ఆవరణలో రూ.6 కోట్లతో దుకాణ సముదాయం నిర్మించారు. ఆదేవిధంగా నగరం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రోడ్ల విస్తరణతోనే సాధ్యమని నమ్మిన నాటి ప్రభుత్వం పట్టణ ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ పూర్తి చేయడంతో పాటు మరో ప్రధాన రహదారి తెనాలి రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. అయితే విస్తరణ పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఎమ్మెల్యేగా నారా లోకేష్ గెలవడంతో చేనేతభవన్ గ్రహణం పట్టింది. ప్రభుత్వాలు మారినా అధికారంలోకి వచ్చిన వారు తెనాలి రోడ్డులోని చేనేత భవన్‌లో దుకాణాలు కేటాయించి తెనాలి రోడ్డు విస్తరణ చేపడతారని భావించిన తమ ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో మున్సిపల్ కాంప్లెక్స్‌గా మారేనా..!

గతంలో మున్సిపాల్టీ వద్ద దుకాణ సముదాయం నిర్మించినా దుకాణల కేటాయింపు వివాదంలో పలువురు కోర్టు కెక్కడంతో 13 సంవత్సరాల పాటు ఆ భవన సముదాయం నిరుపయోగంగా మారింది. చేనేత భవన్‌కు అదే దుస్థితి కలుగుతుందేమోనని చేనేత వస్త్ర వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయాలను పక్కన పెట్టి ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.6 కోట్లతో నిర్మించిన చేనేత దుకాణ సముదాయాన్ని ప్రారంభించి దుకాణాలను కేటాయించాలని వస్త్ర వ్యాపారులు కోరుతున్నారు. తెనాలి రోడ్డులోని వస్త్ర వ్యాపారులకు దుకాణాలను కేటాయిస్తే యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలు ఖాళీ చేస్తారు కనుక తెనాలి రోడ్డు విస్తరణ వేగవంతం చేయవచ్చు. కాబట్టి పాలకులు సత్వరమే చర్యలు తీసుకోని దుకాణాలు కేటాయించాలని, ఆదేవిధంగా తెనాలి రోడ్డు విస్తరణను సత్వరమే చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వెంటనే దుకాణాలు కేటాయించాలి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్యల చేనేత భవనం నిర్మించింది. ప్రభుత్వం వెంటనే చేనేత భవన్ దుకాణాలను వ్యాపారులకు కేటాయించాలి. రాజకీయాలకు అతీతంగా దుకాణాలను కేటాయించి ప్రారంభించాలి. చేనేత భవన్ దుకాణాల వలన వస్త్ర వ్యాపారులకు మరింత మార్కెటింగ్ పెరిగి వ్యాపారం పెరుగుతుంది.

– ఆకురాతి రాజేష్, చేనేత ఉత్పత్తిదారుడు, మంగళగిరి

తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టాలి



రోడ్ల విస్తరణతోనే పట్టణం అభివృద్ధి చెందుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో తెనాలి రోడ్డు విస్తరణ చేసేందుకు మార్కింగ్ చేశారు. అనివార్య కారణాల వలన విస్తరణ నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టాలి. గౌతమబుద్ధా రోడ్డు విస్తరణతో పట్టణంలో కొంతమేర ట్రాఫిక్ కష్టాలు తప్పాయి. తెనాలి రోడ్డు విస్తరణ పూర్తి చేసి ప్రజలను ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలి.

– ఎండీ ఫిరోజ్, మంగళగిరి

టిడ్కో గృహ లబ్ధిదారుల బ్యాంకు రుణాలు రద్దుచేయాలి

తాడికొండ: రాజధానిలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలను రద్దుచేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. దొండపాడులో సీపీఎం శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో చేసేందుకు పని లేక, కుటుంబాలు గడవక పేదలు ఇబ్బందులు పడుతున్నారని వారికి ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాజధానిలో నిర్మించిన టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్న పేదలకు ఉపాధి లేనందున వారి బ్యాంకు రుణాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉచిత ఇసుకను సక్రమంగా సరఫరా చేయాలని, విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడాలన్నారు. ఇంధన చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం శాఖ దొండపాడు నూతన కార్యదర్శిగా చేవూరి నరసమ్మను ఎన్నుకున్నారు. సీపీఎం నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, కె.చిన్నమ్మాయి, చేవూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ప్రసాదరావు బాధ్యతల స్వీకారం

ఫిరంగిపురం: మండల తహసీల్దార్‌గా జె.ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన నాంచారయ్య బాపట్లకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ మోహన్, ఏఎస్ఓ శివ, రెవెన్యూ సిబ్బంది ప్రసాదరావును శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతే అభివృద్ధికి పునాది

మేడికొండూరు: ప్రతిఒక్క పౌరుడు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ టి.చందన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆర్థిక అక్షరాస్యత అనేది అభివృద్ధికి పునాది అన్నారు. సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధి సాధనకై భారతీయ రిజర్వ్ బ్యాంక్ రూపొందించిన నిబంధనల మేరకు ప్రతి ఒక్క పౌరుడు బ్యాంక్ నందు ఖాతా కలిగి ఉండాలని, సక్రమ లావాదేవీలు నిర్వహించట ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. మండల ఏపీఎం విజయభారతి మాట్లాడుతూ బ్యాంకు నుంచి రుణాలు పొందటం , చెల్లింపులు గురించి అవగాహన కల్పిస్తూ బ్యాంకు నుంచి రుణాలు పొందటం, తిరిగి వాటిని చెల్లించే విధానాన్ని వివరించారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ బ్యాంకులతో సత్సంబంధాలు కలిగి ఉండటం ద్వారా మాత్రమే అన్ని రంగాలలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. కె.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, విప్పర్ల విజయభాస్కర్,యానిమేటర్స్ మరియు డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ సీఎస్ఈ హానర్స్ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని అన్నారు. రెండు మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా పి.సురేష్ వ్యవహరించారు. వలంటీర్లను వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగాం ఆఫీసర్ ఎన్.నవీన్ తదితరులు అభినందించారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ వలంటీర్లు

కేఎల్‌యూలో నాక్ సెన్సిటైజేషన్ కార్యశాల

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కెఎల్ యూనివర్సిటీలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ఆధ్వర్యంలో నాక్ సెన్సిటైజేషన్ కార్యశాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాస ఆధారిత విద్య (ఓబీఈ) ద్వారా బోధన మరియు అభ్యాసంలో నాణ్యతను అందించడం ఎంతో ప్రాముఖ్యమన్నారు. జాతీయ విద్యావిధానం–2020లో ముఖ్యమైన భాగం అయిన ఫలితం ఆధారిత విద్యపై దృష్టి సారించడం ద్వారా బోధన మరియు అభ్యాస నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎన్ఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తీక్ బాలసుబ్రమణియన్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహించారు. ఈ కార్యశాలలో పాల్గొన్న వారికి క్వాలిటీ డీన్ డాక్టర్ కె.రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, అకడమిక్స్ డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ

బాలిక అదృశ్యంపై కేసు

తాడికొండ: లింగాయపాలెం గ్రామంలో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్ళూరు మండలం లింగాయపాలెం గ్రామంలో 10వ తరగతి చదువుకొని ఇంట్లోనే ఉంటున్న 17 సంవత్సరాల బాలిక ఈ నెల 6వ తేదీన కనిపించకుండా పోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లవద్ద వాకబు చేయడంతో పాటు, పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

రజక వృత్తిదారుల సభ్యత్వ నమోదు


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సభ్యుల సభ్యత నమోదు కార్యక్రమాన్ని బుధవారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని కుంచనపల్లి, తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని నవోదయ కాలనీ, సీఆర్ఎస్ కళ్యాణ మండపం ప్రాంతం, అమరావతి ఐకాన్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, బడ్జెట్ నిధులను రజకుల అభివృద్ధికి ఖర్చు చేయాలని, ఆదరణ పథకం ద్వారా రజక వృత్తిదారులకు అవసరమైన వృత్తి పరికరాలను వెంటనే అందజేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి రజక వృత్తిదారునికి సామాజిక పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.
సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు, సంఘ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీ దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, అంజూరి రాంబాబు, మాచవరపు నరసింహారావు, కొండాయగుంట యానాది రావు, క్లోపల్లి గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్యలో మద్యం షాపు

తొలగించాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసాల మధ్య ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు ఉష మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కట్ట నుంచి మణిపాల్‌కు వెళ్లే రహదారిలో నివాసాల మధ్య ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని ఎంతోమంది మహిళలు, చిన్నారులు ఈ రోడ్డులో తిరుగుతుంటారని, గతంలో ఇదే బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించిన దుండగుడు ఒక హత్య కూడా చేశాడని, ఎంతో మంది మహిళలతో మద్యం ప్రియులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని అన్నారు. పంట పొలాల్లో బార్‌కు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. పక్కన ఉన్న పంటపొలాల్లో మద్యం సేవిస్తూ పంట పొలాల్లో వ్యభిచారం చేస్తున్నారని, గంజాయి విక్రయ కేంద్రాలుగా మారుస్తున్నారని ఆమె అన్నారు. దీంతో తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందిస్తామని, సమస్య పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఐద్వా నాయకులు సుధ, శాంతకుమారి, సత్యలక్ష్మి, వాణి, మల్లేశ్వరి, పద్మ, అన్నపూర్ణ, రత్న, కృష్ణవేణి, బేబి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య

తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా

తాడేపల్లిరూరల్: భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయులు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. వీర వనిత షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ ఆనాటి అసమానతల సమాజంలో అడుగడుగునా వివక్షను, ఎన్నో అవమానాలను, దాడులకు ఎదుర్కొని బెదరకుండా నాటి మహిళలపై జరుగుతున్న సాంఘిక దురాచారాలను అరికట్టేందుకు ఒక్క విద్యా ద్వారానే సాధ్యమని ఫాతిమా నమ్మారన్నారు. బాలికా విద్యకోసం 1848లో తన ఇంటినే మొదటి బాలికల పాఠశాలగా ఏర్పాటు చేసి, సావిత్రీబాయి పూలేతో కలసి ఎందరికో స్ఫూర్తిగా షేక్ ఫాతిమా నిలిచారని అన్నారు. ఆమె సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి 2020లో 8వ తరగతిలో తెలుగు పాఠ్య పుస్తకంలో ఫాతిమా జీవిత చరిత్రను చేర్చి తగిన గౌరవం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జలీల్, షేక్ రషీద్, గాలాబ్ బేగ్, షేక్ జాన్ సైదా, షేక్ బాజీ, షేక్ కొనేన్, షేక్ జాన్, షేడ్ గూడవల్లి, షేక్ మస్తాన్ వలి, మహమ్మద్ హనీఫ్, కాకా వెంకటేశ్వర్లు, మునిపల్లి కుమార్ పాల్గొన్నారు.


షేక్ ఫాతిమా చిత్ర పటానికి పూలమల వేసి నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకులు

తప్పుడు పత్రాలతో స్థలం అమ్మిన వ్యక్తిపై కేసు

తాడికొండ: తప్పుడు దస్తావేజులు సృష్టించి స్థలం అమ్మిన వ్యక్తిపై వచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం లాం గ్రామానికి చెందిన ఉన్నవ శ్రీనివాసరావు గుంటూరుకు చెందిన ముప్పా గురవయ్యకు తప్పుడు దస్తావేజులతో స్థలం అమ్మి మోసానికి పాల్పడ్డాడు. లాం గ్రామంలో సర్వే నెంబర్ 277ఎలో 238, 239నంబరు గల ప్లాట్లు చూపించి వాటి విస్తీర్ణం 520 గజాలు అని చెప్పి నమ్మించి తన స్థలంగా చెప్పి రూ.20లక్షలు తీసుకొని 2020 జూలై 15న తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముప్పా గురవయ్య పేరిట ఉన్నవ శ్రీనివాసరావు ప్లాటు రిజిస్టర్ చేశాడు. ఈ భూమిని 2021 ఫిబ్రవరి 4న కొద్ది పాటి లాభంతో గురవయ్య కొండపల్లి సీతయ్య అనే వ్యక్తికి నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విక్రయ అగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా రిజిస్టర్ చేశారు. అయితే ఇక్కడ భూమి లేదని ఆలస్యంగా గ్రహించిన కొనుగోలుదారుడు సుబ్బారావు 2024 సెప్టెంబర్ 27న తనకు విక్రయించిన ప్లాటును ప్రైవేటు సర్వేయర్ల ద్వారా కొలిచేందుకు వెళ్లి చూస్తే అక్కడ ఆ భూమిలేకుండానే తనకు అమ్మినట్లు గుర్తించి ఉన్నవ శ్రీనివాసరావును సంప్రదించాడు. అయితే శ్రీనివాసరావు ఆ విషయం తనకు ముందే తెలుసని, మోసం చేసి రూ.20 లక్షలు తీసుకొని అప్పులు తీర్చుకొన్నానని తెలిపాడు. ఈ విషయం పోలీసులకు చెప్పినా.. కోర్టుకు వెళ్లినా తన చేతిలో రౌడీలు ఉన్నారని, వారిచేత చంపిస్తానని బెదిరించినట్లు బాధితుడు ముప్పా గురవయ్య వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

మిరప, పత్తి సస్యరక్షణపై శిక్షణ

ఫిరంగిపురం: జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని శిరంగిపాలెం, తక్కెళ్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శివ కుమారి పత్తి, మిర్చి పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మిర్చి, పత్తి పంటలను పరిశీలించి తగిన సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ వాసంతి, సిబ్బంది సుబాని, గౌస్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

సూరేపల్లి(భట్టిప్రోలు): స్వర్ణాంధ్ర–2047అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా మంగళవారం షీల్డ్, సర్టిఫికెట్ అందుకుంది


పెనుమాకలో సరస్వతీదేవిగా..


కంఠం రాజు కొండూరులో


రాజీవ్ గృహకల్పరోడ్డులో


శివాలయంలో సరస్వతిగా..


నృసింహస్వామి ఆలయంలో..


పాతమంగళగిరి కనకదుర్గ ఆలయంలో..


విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధైర్యలక్ష్మిగా..


ఉండవల్లి రెడ్ల రామమందిరంలో సరస్వతీ పూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

సరస్వతీ నమస్తుభ్యం!

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

–మంగళగిరి, తాడేపల్లిరూరల్